

ప్రగతి కోసం పరిశ్రమలు

● నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ ● ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భూసేకరణ ● కడప, అన్నమయ్య జిల్లాల్లో భూముల గుర్తింపు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సర్కారు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక రంగంపై గురిపెట్టింది. జిల్లా కేంద్రంలో ఉన్న పారిశ్రామికవాడలే కాకుండా నియోజకవర్గాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి నియోజకవర్గానికి మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) పార్కు ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఏపీఐఐసీ ద్వారా భూసేకరణ చేపట్టింది. ఇక్కడ మౌలిక వసతులు కల్పిస్తే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీంతో ఆప్రాంత రూపురేఖలు మారనున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతం

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉన్నాయి. పెద్ద సంఖ్యలో భూములు ఉన్నాయి. ఖనిజ నిక్షేపాలు, రవాణా సౌకర్యం ఉంది. ఇప్పటికే కడప శివారులోని కొప్పర్తి పారిశ్రామికవాడ జిల్లాకు ఆర్థికంగా దన్నుగా ఉంది. కొప్పర్తి సౌత్ జోన్‌లో 2,695.74 ఎకరాలు, నార్త్ జోన్‌లో 3,900 ఎకరాల భూములున్నాయి. ఇక్కడ చిన్నవి, పెద్దవి కలుపుకుని సుమారు 100కు పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ డిక్సన్ కంపెనీలో 2,200 మంది పనిచేస్తున్నారు. డీజీజీ గార్మెంట్ పరిశ్రమ నడుస్తోంది. ఇక టీవీల తయారీ కంపెనీ టెక్నోమో ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇక్కడ ఆడియో పరికరాల తయారీ కంపెనీ త్వరలో ప్రారంభించనుంది. దాదాపు 2500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ కార్పొరేషన్‌లో భాగంగా సౌత్ బ్లాక్‌లో 2,595.74 ఎకరాలను సుమారు రూ.2వేల కోట్లతో ఇక్కడ అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రోడ్లు, విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇక బద్వేలు సమీపంలోని గోపవరం వద్ద సెంచరీ ప్లేవుడ్ సంస్థకు వంద ఎకరాలు కేటాయించగా, అక్కడ 2.266 మందికి ఉద్యోగాలు కల్పించారు.

ఎంఎస్ఎంఈ పార్కుల కోసం

భూముల గుర్తింపు

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కోసం ప్రతి నియోజకర్గంలో 50 ఎకరాలకు తగ్గకుండా భూములు గుర్తిస్తున్నారు. ఇక్కడ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే ఔత్సాహికులకు అన్నివిధాలా సహకరిస్తే పరిశ్రమలు ఏర్పడతాయని సీఎం భావిస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటయితే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. కుటుంబంలో ఉద్యోగస్తులంటే ఆ కుటుంబ జీవన విధానమే మారిపోతుంది. దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబునాయుడు ముందుకెళుతున్నారు.

● కడప జిల్లాలో.. కడప, మైదుకూరు నియోజకవర్గాల్లో పార్కులకు అవసరమైన భూమి అందుబాటులో లేదు. ఇక కొప్పర్తి కమలాపురం నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. పులివెందులలోని ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఈ కోసం 29.75 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఐడీపీలో 565.80 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే ఇక్కడ కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్లలో 209.05 ఎకరాలు, ప్రొద్దుటూరులోని చౌడూరులో 60 ఎకరాలు గుర్తించారు. బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలం పీపీకుంట వద్ద 490.30 ఎకరాలు ఉంది. ఇప్పటికే ఇందులో వంద ఎకరాలను సెంచరీ ప్లేవుడ్ పరిశ్రమ కోసం కేటాయించారు.



కడపలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం

● అన్నమయ్య జిల్లాలో.. మదనపల్లె నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమి అందుబాటులో లేదు. ఇక రాయచోటి నియోజకవర్గం శిబ్యాల వద్ద 500 ఎకరాలు, రాజంపేట నియోజకవర్గం నందలూరులో 60 ఎకరాలు గుర్తించారు. రైల్వేకోడూరు నియోజకవర్గం వైకోటలో 60 ఎకరాలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో కుక్కరాజుపల్లె వద్ద 70 ఎకరాలు గుర్తించారు. కాగా.. పీలేరు నియోజకవర్గంలో ఇప్పటికే పీలేరు, వాల్మీకిపురంలలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భూములు ఉన్నాయి.

భూముల గుర్తింపు..

ప్రభుత్వం ఆదేశాల మేరకు జోనల్ పరిధిలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో ప్రతి నియోజకవర్గానికి ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం భూములను గుర్తిస్తున్నాం. కడప, మైదుకూరు, మదనపల్లెల్లో భూములు అందుబాటులో లేవు. మిగతాచోట్ల ఇప్పటికే గుర్తించాం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

\- శ్రీనివాసమూర్తి, జోనల్ మేనేజరు, ఏపీఐఐసీ





మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా సాగాలి : ఎస్పీ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యం దిశగా అడుగులు వేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 51వ వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ సలీంబాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. తాను కూడా విద్యార్థి దశలో ఉన్నప్పుడు తమ గురువులు మాటలను ప్రేరణగా తీసుకుని నిరంతరం కృషిచేసి పోటీ పరీక్షలకు హాజరై విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఒక విశ్వవిద్యాలయంతో సమానమన్నారు. రిజిస్ట్రార్ పద్మ మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను అతిసులభంగా సాధించవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురివిరెడ్డి, స్టూడెంట్ చైర్‌పర్సన్ షేక్ ఆయేషా పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లు

● అర్బన్ కార్యాలయంలో ప్రజలకు అవగాహన



స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ప్రసాద్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలైంది. ఈ నేపథ్యంలో కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానంపై దస్తావేజు లేఖర్లకు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐజీ పీవీఎస్ బాబు మాట్లాడుతూ భూములు, స్థలాలు, ఇతర రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్లు జరగకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా గంటలతరబడి నిరీక్షించాల్సి ఉండేదన్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా అనుకున్న తేదీకి, అనుకున్న సమయానికే రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల దారులు ఐజీఆర్ఎస్ యాప్ ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇంటినుంచే స్లాట్ బుకింగ్ చేసుకుని అందులో మీరు పొందుపరిచిన సమయానికే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోతే నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పూర్తి సమాచారం అందించి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ సమయంలో తీసుకున్న చలానాలు, స్థిరాస్తుల హద్దులు, సర్వే నెంబరు వివరాలను పక్కాగా నమోదు చేయాలని, సందేహాలుంటే సబ్ రిజిస్ట్రార్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్, అర్బన్ కార్యాలయాల సబ్ రిజిస్ట్రార్లు షేక్ నాసీర్, హరికృష, దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షుడు వేణుగోపాల్, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు కొట్టివేత



కోర్టు వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు ఆర్.శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కడప రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘనకు సంబంధించి నమోదైన కేసును శుక్రవారం జడ్జి కొట్టివేశారు. 2024లో ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్‌తో పాటు వాహిద్‌లు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి జై ఎన్టీఆర్, జై చంద్రబాబు, జై లోకేశ్ అంటూ నినాదాలు చేశారని అధికారులు వారిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. ఈ కేసుపై ఎక్సైజ్ కోర్టులో వాదనలు జరుగుతూ వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం తుది వాదనలు విన్న ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమస్రవంతి సరైన ఆధారం లేకపోవడంతో కేసు కొట్టివేశారు. టీడీపీ నేతల తరుపున న్యాయవాదులు జీఎస్‌మూర్తి, గంగిరెడ్డి శంకర్‌రెడ్డి, గడ్డ గుర్రప్ప వాదనలు వినిపించారు.



విద్యుత్ దీపకాంతులలో కోదండ రామాలయం

నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

● 11న కల్యాణోత్సవం

● 12న రథోత్సవం, 14న చక్రస్నానం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరామయ్య బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరగనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఇందులో భాగంగా 5వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు అంకురార్పణ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించనున్నారు. 6న ఆదివారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం, అదేరోజు 11 గంటలకు పోతన జయంతి సందర్భంగా కవి సమ్మేళనం, సాయంత్రం 7 గంటలకు శేషవాహనంపై కోదండరాముడు దర్శనమివ్వనున్నారు. 7న సోమవారం ఉదయం వేణుగాన అలంకారం, సాయంత్రం హంసవాహన కార్యక్రమం, 8న మంగళవారం ఉదయం వటపత్రసాయి అలంకారం, సాయంత్రం సింహ వాహనంపై కోదండరాముడు ఊరేగనున్నారు. ఇక 9న బుధవారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. 10న గురువారం ఉదయం మోహిని అలంకారం, సాయంత్రం గరుడసేవ, 11న శుక్రవారం ఉదయం శివధనుర్బాలంకారం, మధ్యాహ్నం 3.15 నుంచి 5 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవం, అదేరోజు రాత్రి గజవాహనం జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారామ కల్యాణోత్సవం 11న సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 12వ తేదీ శనివారం సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి రథోత్సవం కార్యక్రమం, 13న ఆదివారం ఉదయం కాళీయమర్దని అలంకారం, రాత్రికి అశ్వవాహనం సేవ, 14న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం జరగనుంది. 15న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు పుష్పయాగం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఒంటిమిట్ట మాడవీధుల్లో భారీ విద్యుత్ కటౌట్లను, ఆలయం వెలుపల భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

డబ్బుల విషయమై ఘర్షణ

● ఇరువర్గాల ఫిర్యాదు ● అంజద్‌బాషా ఇంటిముందు మహిళల ధర్నా



డిప్యూటీ సీఎం ఇంటి వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కడప క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బు విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అరెస్టు అయిన వ్యక్తిని విడిపించుకు పోయారంటూ మరో వర్గం మహిళలు మాజీ డిప్యూటీ సీఎం ఇంటిముందు ఆందోళనకు దిగారు. ఇరువర్గాల కథనం మేరకు..

మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా అనుచరుడైన సయ్యద్ ఇబ్రహీం మియా శుక్రవారం చెన్నూరు బస్టాండు వద్ద వెళుతుండగా బుడ్డాయపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి భార్య, కుమార్తెలు, సోదరి అతడిని అడ్డుకున్నారు. తమ తండ్రి నుంచి 2016లో తీసుకున్న రూ.48 లక్షలు ఇవ్వాలంటూ నిలదీయడంతో అతను వీరిపట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో మహిళలు సయ్యద్ ఇబ్రహీంమియాపై దాడి చేసి అతడిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన అనుచరుడిని విడిపించుకుని వెళ్లారు. దీంతో మహిళలు డిప్యూటీ సీఎం ఇంటి వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. ఇబ్రహీంమియా తమ డబ్బులు ఇవ్వకుండా మహిళలని కూడా చూడకుండా దాడి చేస్తే అతన్ని ఎలా విడిపిస్తారంటూ నిలదీశారు. అంజద్‌బాషా, దేవిరెడ్డి ఆదిత్య, మియా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో డిప్యూటీ సీఎం వారి వద్దకు వచ్చారు. ఎవరైనా ఇలా పోలీసుస్టేషన్‌లో ఉన్నారంటే వస్తానని అన్నారు. అంతే తప్ప తన ఇంటి ముందు ధర్నాకు దిగడం మంచిది కాదంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అక్కడ నుంచి పంపించేశారు.

కాగా.. చెన్నూరు బస్టాండు వద్ద వెళుతున్న మహిళలు అడ్డగించి తనపై దాడి చేశారంటూ సయ్యద్ ఇబ్రహీంమియా ఫిర్యాదు ఇవ్వడంతో మహేశ్వర్‌రెడ్డి భార్య, ఇద్దరు కుమార్తెలు, చెల్లెలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. తన భర్త వద్ద రూ.48లక్షలు సయ్యద్ ఇబ్రహీంమియా తీసుకున్నాడని ఆ డబ్బు ఇవ్వాలని అడగ్గా తమను తిట్టడంతో పాటు దాడి చేశాడంటూ మహేశ్వర్‌రెడ్డి భార్య సులోచన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గెలిచిన 'దేవర మాన్యం'

● రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలు విడుదల

అనంతపురం కల్చరల్/సెంట్రల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. సీనియర్ రచయిత, రాయలసీమ ఉద్యమనేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి స్మారకార్థం రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల రాయలసీమ నాటక రచనా పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఆ వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రచయితలు నాటక రచనలను పంపారు. తిరుపతికి చెందిన వీఆర్ రాసాని రచించిన 'దేవర మాన్యం' రచనకు ప్రథమ బహుమతి దక్కింది. అనంతపురానికి చెందిన దామోదర్‌రెడ్డి రచించిన 'కొత్త సేద్యగాళ్లు' రచనకు ద్వితీయ బహుమతి వచ్చింది. తృతీయ బహుమతికి హైదరాబాద్‌కు చెందిన పాణ్యం దత్తశర్మ రచించిన 'నల్లకాలర్' హిందూపురానికి చెందిన శాంతి జయప్రకాష్ రచించిన 'సమిధలు', కళ్యాణదుర్గానికి చెందిన 'పరివర్తన' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. అలాగే ప్రత్యేక బహుమతుల కింద ఏలూరు జిల్లా వెంకట నాగేంద్ర మాగంటి రచించిన 'వేట కొడవలి', కర్నూలుకు చెందిన పర్వతయ్య రచించిన 'చిన్నారి రేఖ', విశాఖపట్నానికి చెందిన పీవీ శేషారత్నం రచించిన 'విజేత', చెన్నైకు చెందిన చతుర్వేదుల చెంచు సుబ్బయ్యశర్మ రచించిన 'సఖ్యత' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. వీరందరికీ రూ.20వేలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు తెలిపారు.

మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమలాపురం ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీకి చెందిన సిరిగిరెడ్డి రాఘవ రెడ్డిని నియమించారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గం యర్రగుంట్ల ఏఎంసీ చైర్మన్‌గా బీజేపీకి చెందిన రామిరెడ్డిపల్లె నాగరాజును నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి 7

ఆన్‌లైన్‌లో సీనియారిటీ జాబితా

కడప వినాయకనగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను కడప డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈవో షంషుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల సహాయకులుగా పదోన్నతి కోసం సబ్జెక్టుల వారీగా జాబితాను ఉంచామని తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 11వ తేదీలోపు పనిదినాల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

అకాల వర్షంతో రూ.161.46 లక్షల పంటనష్టం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ ఏడీఏ ఎస్ఎస్‌వీ సుభాషిణి తదితరులు

కడప రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో 7 మండలాల్లోని 24 గ్రామాలలో రూ.161.46 లక్షల పంటనష్టం వాటిల్లింది. 474 మంది రైతులకు సంబంధించి 463.32 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి పంట 456.30 హెక్టార్లు కాగా బొప్పాయి 7 హెక్టార్లలో దెబ్బన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఖాజీపేట, చింతకొమ్మదిన్నె, బి.మఠం, కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, లింగాల మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు అధికారులు శుక్రవారం పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేశారు.

చెక్కభజన @ పుల్లయ్య

● ప్రముఖుల చేత ప్రశంసలు, అవార్డులు
● 10 వేల మందికి పైగా శిష్యులు
● విదేశాలలో సైతం ప్రదర్శనలు


కులుకు భజనలో శిష్యులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం


జడకోపు నేర్పిస్తున్న పుల్లయ్య

బద్వేలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఎంతో ప్రజాదరణ పొందుతున్న చెక్కభజన కళారూపానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో చెక్కభజన గురువు ఎస్.పుల్లయ్య విశేష కృషి చేస్తున్నారు. కడప జిల్లాలోని వందలాది గ్రామాలలో భజన గురువుగా సేవలందిస్తున్న పుల్లయ్య బ్రహ్మంగారిమఠం మండలంలోని ఓబయ్య, పుల్లమ్మలకు జన్మించారు. ఈయన చిన్నతనం నుంచే భక్తి పాటలు, దరువులు శాస్త్రీయంగా నేర్చుకున్నారు. చెక్కభజన, కోలాటం, జడకోపు కళారూపాలలో ఆసక్తి పెంచుకున్నారు. ప్రకాశం జిల్లా నరప గ్రామానికి చెందిన భజన సుబ్బయ్య దగ్గర శిష్యరికం పొందారు. అనేక మంది కళాకారులకు పుల్లయ్య శిక్షణ ఇచ్చారు. వారి శిష్యులే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వివిధ గ్రామాలలో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇప్పటివరకు పుల్లయ్య 10 వేలమంది కళాకారులకు శిక్షణ ఇచ్చారు. ఈయన శిష్యులే సుమారు 200 మంది గురువులుగా ఎదిగారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోనే గాక ఇతర రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, బిహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, ఇటలీ, స్విట్జర్లాండ్ దేశాలలో కూడా సుమారు 5 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. విదేశాలలో కూడా ప్రదర్శనలిచ్చి మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు. గురువులుగా ఎదిగి చెక్కభజన కళారూపాన్ని ముందుతరాలలోకి తీసుకెళుతున్నారు. రామాయణం, భారతం, భాగవతం కథలను, భక్తిగీతాలను, జానపద గేయాలను మేళవించి చెక్క భజన కులుకు భజనగా రూపాంతరం చెందడంతో పుల్లయ్య ఆద్యుడుగా చెప్పుకుంటున్నారు. 200 పాటలను 20 క్యాసెట్లుగా పుల్లయ్య రూపొందించారు. పుల్లయ్య ప్రతిభను గుర్తించిన అప్పటి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, యువజన సర్వీసుల డైరెక్టర్ డాక్టర్ గోవిందరెడ్డి, సీపీ బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు తనకు సలహాదారులుగా, మార్గదర్శకులుగా వ్యవహరించారని, ఈశ్వర్‌రెడ్డి సూచనలతో తన కళా నైపుణ్యం మెరుగుదిద్దుకున్నానని పుల్లయ్య చెప్పుకుంటూ ఉంటారు. రాయలసీమలో ప్రముఖ కళగా చెప్పే చెక్కభజనను శాస్త్రీయ పద్ధతులను జోడించి అడుగుల తీరును మరింత విస్తృతపరిచామని పుల్లయ్య తెలిపారు. భక్తికి, జనాదరణకు అనుగుణంగా చెక్కభజన, కులుకుభజన కళారూపాన్ని మలుచుకుంటూ వెళుతున్న పుల్లయ్య తెలుగు విశ్వవిద్యాలయం 2001లో జానపద కళావిభాగంలో ఇన్‌స్ట్రక్టర్‌గా నాలుగు నెలల పాటు సేవలందించారు. పూర్వం చెక్క భజనకు డోలు, డౌలర్, హార్మోని, సంగీత వాద్యాలుగా ఉండగా ప్రస్తుతం క్లారినెట్, కీబోర్డులను ఉపయోగిస్తున్నారని, అయితే ఆహూతులను బట్టి ఏ వాయిద్యానికి ఉన్న ప్రాధాన్యత వాటికి ఉందని సంప్రదాయ వాయిద్యాల గొప్పతనం గురించి అందరికీ తెలిసిందని పుల్లయ్య అంటారు.


ఢిల్లీలో రిపబ్లిక్‌డే వేడుకల్లో ప్రదర్శన ఇస్తున్న పుల్లయ్య బృందం

పుల్లయ్యకు అవార్డుల పంట


అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో అవార్డు అందుకుంటున్న పుల్లయ్య

చెక్కభజన, కులుకు భజనలో ప్రావీణ్యం సాధించిన పుల్లయ్యకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపుతో పాటు అనేక కళా, సాంస్కృతిక సంస్థల అవార్డులు కూడా లభించాయి. 2001 జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో అప్పటి ప్రధాని వాజ్‌పేయిని కలుసుకునే అవకాశం పుల్లయ్య బృందానికి లభించింది. చెక్కభజన కళా ప్రదర్శన పట్ల ఆసక్తి చూపిన పుల్లయ్య బృందానికి విందు ఇచ్చారు. అలాగే జనవరి 26న అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సమక్షంలో ఢిల్లీలో పుల్లయ్య బృందం చెక్కభజనను ప్రదర్శించింది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) నిర్వహించిన తెలుగు జానపద కళోత్సవంలో తానా అధ్యక్షురాలు పద్మశ్రీ నుంచి పుల్లయ్య అవార్డు అందుకున్నారు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నుంచి అవార్డు అందుకున్నారు. 1989లో రాష్ట్ర సమాచార శాఖ నుంచి ప్రశంసాపత్రం, 1991లో రాష్ట్ర స్థాయి యువజన అవార్డును అందుకున్నారు. 2004లో ఇటలీలో వాటికన్ నగరంలో నెలపాటు ప్రదర్శన ఇచ్చి అక్కడ ఆయన ఆశీర్వాదాన్ని అందుకున్నారు. 2009లో బి.మఠం మండలంలోని ఈశ్వరీదేవి మఠంలో 24 గంటల పాటు ప్రదర్శన ఇచ్చారు. అలాగే 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా అవార్డు అందుకున్నారు. 500 మంది కళాకారులతో కృష్ణా పురస్కారాలలో ప్రదర్శన ఇచ్చారు. రాజభవన్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. 1991లో అప్పటి ముఖ్యమంత్రి జనార్ధన్‌రెడ్డితో అవార్డు పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం వారిచే ఉగాది పురస్కారం, ఆంధ్రప్రదేశ్ యూత్ అవార్డు, టీటీడీ పురస్కారం కూడా లభించింది. ఇలాంటి అనేక అవార్డులు, రివార్డులు,సన్మానాలు, సత్కారాలు అనేకం కులుకు భజన పుల్లయ్య పొందడం విశేషం. ఇన్ని అవార్డులు ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కులుకుభజన పుల్లయ్యకు సొంత ఇల్లు లేదు. ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించి పుల్లయ్యకు ఆర్థికసాయం అందించి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన శిష్యులు కోరుతున్నారు.


ఇటలీ దేశంలో అవార్డు అందుకుంటున్న పుల్లయ్య

జానపద కళలకు జీవం పోస్తున్న కత్తి

● 4 వేల మంది కళాకారులకు శిక్షణ
● ఉమ్మడి రాష్ట్రాల్లో ఎన్నో ప్రదర్శనలు
● పలు నంది అవార్డులు రామలింగారెడ్డికి సొంతం


భీముడి వేషధారణలో కత్తి రామలింగారెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎంతో మంది కళాకారులను చూస్తూ ఉన్నాం చెక్కభజనలు, కోలాటాలు, లంబాడీ నృత్యాలు, మల్లెదర కుక్కలు, పిల్లనగ్రోవి, నృత్యాలు, కూచిపూడి నృత్యాలు ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో కలవు. అందులో కలలు 64 అందులో జానపదం ఒకటి. జానపదం అనగానే అందరికీ గుర్తుకొచ్చేవి పల్లెటూర్లు, పచ్చని పొలాలు, పిచ్చుకలు, గువ్వలు చేసే వాటి శబ్దాలు, వరినాట్లు వేస్తూ మహిళలు పాడే పాటలు అందరికీ వినసొంపుగా ఉంటూ జానపద పాటలు అందరి మనసులను ఆనందింపజేస్తాయి. ఇలాంటి జానపద కలలకు జీవం పోస్తూ కళామ్మతల్లి ముద్దుబిడ్డగా పేరు సాధించాడు కత్తి రామలింగారెడ్డి. ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్ది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎన్నో నృత్య ప్రదర్శనలు చేసి తనదైన శైలిలో అందరినీ మెప్పించి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుని 2024లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డు సొంతం చేసుకుని డాక్టరేట్‌ను పొందారు. ఆయన సొంత ఊరు సంబేపల్లె మండలం గున్నికుంట్ల గ్రామం, కత్తివాండ్లపల్లె. కత్తి నారాయణమ్మ, వెంకటరెడ్డిల దంపతులకు చెందిన ఈయన తండ్రి జానపద పాటలతో ఆకర్షితుడై తండ్రిని ఆదర్శంగా తీసుకుని జానపదంపై పట్టు సాధించారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర నాట్య కళామండలి స్థాపించి 45 సంవత్సరాలుగా సుమారు 4 వేల మంది జానపద కళాకారులకు శిక్షణ ఇచ్చి తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కోలాటాలు, చెక్కభజనలను ప్రదర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం భజన మండలిలో సుమారు 110 బృందాల రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించినట్లు తెలిపారు. కడప, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో పాటు టీటీడీ ఈవో ఆర్గనైజర్ల ద్వారా సన్మానాలు, ప్రశంసలు పొందారు. హైదరాబాదులో గత ఏడాది డిసెంబరులో జరిగిన పోటీల్లో మనం సంస్థ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వేణుగోపాలచారి చేతుల మీదుగా నంది అవార్డుతో పాటు డాక్టరేట్ సొంతం చేసుకున్నారు.


అవార్డు అందుకుంటున్న రామలింగారెడ్డి


రామలింగారెడ్డి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన

సంతోషంగా ఉంది



గ్రామీణ ప్రాంతంలో ఎంతోమందిని కళాకారులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉంది. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన కోలాటాలు, చెక్కభజనలు భజన బృందాలుగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి వారిని ప్రోత్సహించడం జరుగుతుంది. ప్రాచీన కలలను కాపాడడం, ఆదరించడం ఎంతో సంతృప్తినిస్తోంది.


- కత్తి రామలింగారెడ్డి

డీడీఆర్‌సీని విజయవంతంగా నిర్వహించాలి : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించబోయే డీడీఆర్‌సీ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 8న జరగబోయే డీడీఆర్‌సీ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ రివ్యూ కమిటీ) సమావేశంపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్


నిందితుడి అరెస్టు చూపుతున్న టూటౌన్ పోలీసులు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కలికిరి మండలం, పొట్టేకుల వారిపల్లెకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి(47) తన భార్యకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందని అనుమానించాడు. ఈ నెల 1న రాత్రి 7.30 గంటల సమయంలో రాంనగర్ పార్కులో ఉన్న సురేంద్రరెడ్డిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిని అడ్డుకున్న మరొక వ్యక్తి శ్రీనివాసులుపై కూడా దాడి చేశాడు. ఇందులో గాయపడిన ఇరువురూ చికిత్స పొందుతున్నారు. కాగా, ఈ కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

రేపు షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక నిమ్మనపల్లె బైపాస్ రోడ్డులోని ప్రైమ్ స్పోర్ట్స్ ఎరీనాలో ఈ నెల 6న ఉదయం 9 గంటల నుంచి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా బాల, బాలికల జట్లు ఎంపిక చేస్తున్నట్లు షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. 2008 ఏప్రిల్ 1 తరువాత పుట్టిన వారు పోటీలకు అర్హులని, తమ ఆధార్ కార్డును తప్పక తీసుకురావాలని చెప్పారు. వివరాలకు 6281881022ను సంప్రదించాలన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది

● ఐటీడీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ చింతకాయల విజయ్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఐటీడీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. మదనపల్లెలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఐటీడీపీ పార్లమెంట్ కార్యదర్శి వేల్పుల వెంకటేశ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనయుడు జునైద్ అక్బారీలతో కలిసి స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్‌ను పరామర్శించి, ఆయన కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. వెంకటేశ్ వైద్యఖర్చులకు గానూ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వెంకటేశ్‌ను కాపాడుకోవడానికి పార్టీ అధిష్టానం కృత నిశ్చయంతో ఉందన్నారు. మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, శ్రీరామ్ చినబాబు వెంకటేశ్ ఆరోగ్యస్థితిపై ప్రతిరోజూ ఆరా తీస్తున్నారన్నారు. వెంకటేశ్ ముగ్గురు పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టు తరఫున చదివించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌ప మస్తాన్, దొరస్వామినాయుడు, పూలకుంట్ల హరిబాబు, చిన్న మహేష్, పఠాన్ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్ ఆరోగ్యస్థితిపై వైద్యులతో మాట్లాడుతున్న విజయ్

కలికిరిని ఎడ్యుకేషన్ హబ్‌గా చేశాం

● ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కలికిరిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్టీయూ వస్తే జిల్లాకు యూనివర్సిటీ లేనిలోటు తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. కలికిరిలో ఇంజినీరింగ్ కళాశాల, సైనిక్ స్కూల్, మూడు పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలలతోపాటు సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్‌లాంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఏర్పాటు చేయడానికి నిరంతరం శ్రమించినట్లు చెప్పారు. జేఎన్టీయూకు ఆనుకునే 1200 ఎకరాలతో పారిశ్రామికవాడను కూడా సిద్ధం చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఈ కళాశాల సర్వతోముఖాభివృద్ధికి చేయూతనివ్వాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ క్రీడారంగంలో కష్టపడితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 2014 నుంచి 2024 వరకూ తాను పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తప్పనిసరిగా మెడల్ సాధించా అన్నారు. తన కష్టానికి ప్రతిఫలంగానే ఆరు రకాల ప్రభుత్వ ఉద్యోగాలు తనముందు నిలిచాయన్నారు. చివరికి ఆదాయ పన్ను శాఖను ఎంచుకున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజు, కళాశాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

● జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేశ్

రాయచోటికలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతులశాఖ అధికారి సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం (గిరిజన బాలుర పాఠశాల వెనుక, రాజంపేట రోడ్డు)లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు శుభవార్త

● 30 లోపు చెల్లిస్తే 5 శాతం పన్ను రాయితీ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర మున్సిపల్‌శాఖ శుభవార్త చెప్పింది. ఈ నెల 30వ తేది లోపు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం పన్ను రాయితీ ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు శుక్రవారం తెలిపారు. అయితే పన్ను డిమాండ్ నోటీసులను ఆన్‌లైన్‌లో విడుదల అయ్యాక ఈఆర్‌పీ ద్వారా పన్ను చెల్లింపు ఆప్షన్ వస్తుందని, అందుకోసం ఈ నెల 6 నుంచి వేచి చూడాలన్నారు. ఈ సదావకాశాన్ని రాయచోటి పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పీలేరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం కడప రోడ్డులోని మద్యం దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పీలేరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు గురువారం రాత్రి సుమారు 12.40 గంటల సమయంలో మద్యం దుకాణం వద్ద గుర్తు తెలియని శవం ఉన్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. మృతుడు లైట్ బ్లూ కలర్ రంగు టీ-షర్టు, నలుపు రంగు షార్ట్ వేసుకుని ఉన్నాడని, అతని వయస్సు 35-40 ఏళ్ల మధ్య ఉంటుందని, అతని కుడి భుజంపై పచ్చబొట్టు ఉందన్నారు. ఎవరైనా గుర్తిస్తే 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.


పోలీసుల అనుమతి తప్పనిసరి

● ఏఎస్పీ మనోజ్‌హెగ్డే


ముస్లిం మైనార్టీ నేతలతో సమావేశమైన ఏఎస్పీ

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లులను లోక్‌సభలో ఆమోదించిన సందర్భంగా ముస్లిం సమాజం తరపున ఎవరైనా నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేపట్టాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌హెగ్డే ముస్లింలకు సూచించారు. శుక్రవారం రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో పట్టణ మసీదుల కమిటీల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ కొంతమంది ముస్లింలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తారని అలాంటివారి మాటలు నమ్మకూడదన్నారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పి.రాజా, ఎస్ఐ లక్ష్మీప్రసాద్, పట్టణంలోని మసీదుల కమిటీల సభ్యులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు యువకులపై కేసు నమోదు


యువకులను అరెస్టు చేసిన పోలీసులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గురువారం సాయంత్రం స్కూటీపై వేగంగా, నిర్లక్ష్యంగా స్టంట్‌లు చేస్తూ బైక్ నడిపిన ఇరువురు యువకులను అదుపులోకి తీసుకుని వారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ యువకులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని యువకులకు స్కూటీని ఇచ్చిన యజమానిని కూడా నిందితుడిగా చేర్చామన్నారు. తమ పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరూ ఎలాంటి వాహనాలను ఇవ్వకూడదని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

వివాహిత అదృశ్యం

● పోలీసులకు ఫిర్యాదు

కలకడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళంపల్లెకు చెందిన వివాహిత గీత(42) అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఇంటి పనుల విషయంలో గీతను ఆమె భర్త చెన్నయ్య మందలించడంతో గత నెల 26న ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పులివెందుల డీఎల్‌డీవోగా విజయలక్ష్మి

కలికిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా వి.విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా పత్తికొండలో పనిచేస్తూ గత కొంతకాలంగా సెలవులో వున్న విజయలక్ష్మి సెలవు ముగించుకుని ఫిబ్రవరి 19న పోస్టింగ్ కోసం విన్నవించింది. దీనిపై పంచాయతీరాజ్ కమిషనరు పంపిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ఆమెను పులివెందుల డీఎల్డీవోగా నియమించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వాలంటీర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో పనిచేసే వారు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెయిల్, అప్పీల్, ష్యూరిటీలు, సాధికార కమిటీ, చట్టపరమైన సహాయం, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌లపై వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పసుపు.. బంగారమాయే

- చేతికి వస్తున్న పసుపు పంట
- క్రమేణా పెరుగుతున్న ధరలు
- మార్చి 15న క్వింటా రూ.8,500
- ఏప్రిల్ 3న క్వింటా రూ.12,499
- రెండు వారాల్లో రూ.4వేలు పెంపు
- అన్నదాతల్లో ఆనందం

కడప రూరల్/ చాపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 4170.68 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగుచేశా రు. ఎకరాకు రూ.30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన 4170 ఎకరాలకు దాదాపు 1,50,000ల నుంచి 1,80,000ల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు అంచనా.. ఇప్పటి వరకు కడప మార్కెట్ యార్డులో 50వేల క్వింటాళ్ల వరకు రూ.61.50 కోట్ల విలువ చేసే పసుపు విక్రయాలు జరిగినట్లు వ్యాపారస్తులు భావిస్తున్నారు. ఈ సీజన్ ముగిసే వరకు రూ.200 కోట్లు వ్యాపారం జరుగుతుందని చెబుతున్నారు.



చింతకొమ్మదిన్నె మండలం వెంకటగారిపల్లెలో కల్లాల్లో ఆరబోసిన పసుపు

పెరుగుతున్న పసుపు సాగు

జిల్లాలో పసుపు పంట సాగు గణనీయంగా పెరుగుతోంది. గత రెండేళ్ల నుంచి పసుపు పంటకు ఆశించిన దిగుబడులతో పాటు మంచి ధరలు ఉండడంతో రైతన్న ల్లో పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో 2024 జూన్ నెలలో ఖరీఫ్ సాగు కింద 4170.68 ఎకరాలలో 23 మండలాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారు. ఇందులో మైదుకూరు మండలంలో అత్యధికంగా 1011.38 ఎకరాలలో సాగు చేయగా బి.కోడూరులో అత్యల్పంగా 00.80 ఎకరాలలో సాగుచేశారు.

> పసుపు పంట సాగు చేసిన రైతన్నల ఇంట సిరులు నిండుతున్నాయి. పసుపు ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో రైతన్న కష్టానికి తగ్గ ఫలితం దక్కుతోంది. కడప మార్కెట్‌లో గురువారం క్వింటా రూ.12,700 ధర పలికింది. మూడు రోజుల నుంచి ఆశాజనకంగా ధరలు పలుకుతున్నాయి. గత నాలుగేళ్ల నుంచి చతికిలపడిన పసుపు ధరలు ఒక్కసారిగా ఎగబాకడంతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. ఈ ధరలు మరింతగా పెరి గే అవకాశం ఉందని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి.

ముమ్మరంగా తవ్వకాలు

జిల్లాలో పసుపు పంట తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2024 జూన్‌లో సాగైన పంట 9 నెలల తరువాత మార్చిలో చేతికి వచ్చింది. ఒక్కసారిగా పశుపు తవ్వకాలు రావడంతో వాటి పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తైన చోట పసుపును కాల్చి కల్లాల్లో ఆరబోశారు. కొంత మంది రైతులు ఆయా గ్రేడులను తయారు చేసి విక్రయాలకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. నాలుగు వంతుల్లో ఇప్పటికే ఒక వంతు పసుపును రైతులు విక్రయించారు. మిగిలిన రైతులు మార్కెట్‌లో ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో మరింత రేటు వస్తుందనే ఆశతో నిల్వ ఉంచుతున్నారు.

క్రమేణా పెరుగుతున్న ధరలు

2024-25లో సాగైన పసుపు పంట ఇప్పుడిప్పుడే కడప వ్యవసాయ మార్కెట్‌కు వస్తుంది. ఈ తరుణంలో క్రమేణా ధరలు పెరుగుతున్నాయి. మరింతగా ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. గత నెల మార్చి మొదటి వారంలో క్వింటా పసుపు రూ.8,000ల వరకు ఉండగా ఆ తరువాత క్రమేణా పెరుగుతూ మార్చి 30 నాటికి రూ. 11,300లకు చేరింది. ఆ తరువాత 4 రోజుల్లోనే రూ.1200లు పెరిగి ప్రస్తుతం రూ.12,499ల ధర పలుకుతోంది. మరింతగా ధరలు పెరుగుతాయన్న ఆశతో రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించకుండా నిల్వ చేశారు. దీంతో మార్కెట్‌లో విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి.

ఎకరాకు 40 క్వింటాళ్లు పండింది



2.70 ఎకరాలలో పసుపు పంటను సాగు చేశారు. ఎకరాకు ఎండిన పసుపు 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. మొత్తం 120 క్వింటాళ్లు పంట పండింది. ఏడాది పొడవునా కుటుంబ సభ్యులమంతా కష్టపడ్డాము. ఆశించిన రీతిలో పంట దిగుబడి వచ్చింది. మంచి ధరలు ఉండడం సంతోషంగా ఉంది.

- బత్తల శ్రీనివాసులు, రైతు, సీతారామపురం గ్రామం. చాపాడు మండలం

కోస్తా జిల్లాల్లో పంట దెబ్బతినడతోనే ధరలు

కొస్తా జిల్లాల్లో తుఫానుల కారణంగా పసుపు పంట దెబ్బ తినడంతోనే పసుపు ధరలు క్రమేణా పెరుగుతున్నాయని ట్రేడర్లు భావిస్తున్నారు. దుగ్గిరాల మార్కెట్ యార్డు పరిధిలోని ప్రకాశం, గుంటూరు, విజయవాడ తదితర జిల్లాల్లో తుఫానుల కారణంగా పంట ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయాయి. అదే సమయంలో మన జిల్లాలో విస్తారంగా సాగైన పసుపు పంటకు తుఫానుల తాకిడి లేకపోవడంతో ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల మేర ఆశించిన దిగుబడులు రావడంతో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయంటున్నారు. పైగా ఏపీలోని పసుపు బంగ్లాదేశ్‌తో పాటు ఇతర పోరుగు దేశాలకు ఎగుమతి అవుతుందని.. ఈ కారణంగా కూడా ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

175 బస్తాల చౌక బియ్యం స్వాధీనం



పట్టుబడిన బియ్యం బస్తాలతో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

చెన్నూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ ఉంచిన 175 బస్తాల చౌక బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. చెన్నూరుకు చెందిన బ్రహ్మయ్య వివిధ ప్రాంతాల నుంచి బియ్యాన్ని సేకరించి వాటిని 175 బస్తాలుగా చేర్చి ఓ వాహనంలో బయటికి తరలించేందుకు సిద్ధంగా పెట్టుకున్నాడు. ఈ విషయం తెలియడంతో కడప ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సు మెం టు అధికారి శ్రీనివాసరావు సిబ్బందితో దాడి చేసి బియ్యం పట్టుకున్నారు. బ్రహ్మయ్య, వెంకటసుబ్బయ్య అనే వ్యక్తులపై స్థానిక పోలీసుస్టేషనులో కేసు నమోదు చేశారు. 175 బస్తాల విలువ రూ.6,94,450 ఉంటుందని తెలిపారు. బియ్యాన్ని మండల ఆర్ఐ కౌశిక్, వీఆర్వో ద్వారా పంచనామా చేయించి సీఎస్‌డీటీ మనోజ్‌కు అప్పగించామని తెలిపారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు ఎం.శివన్న, ఏవో బాల గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం... నిందితుడి అరెస్టు

పులివెందుల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పార్నపల్లె రోడ్డులో కోతిసమాధి వద్ద గంజాయి విక్రయిస్తున్న చట్టా మల్లికార్జున అనే యువకుడి అరెస్టు చేసి.. 1.07కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో చిన్నరంగాపురానికి చెందిన చట్టా మల్లికార్జున గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో దాడి చేసి మల్లికార్జునను అరెస్టు చేసి... కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్ పెట్టిన వ్యక్తి అరెస్టు

కడప(క్రైం), ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డుకు సంబంధించి మతాలను రెచ్చగొట్టే విధంగా పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వక్ఫ్ బోర్డుకు సంబంధించి బిల్లును ఆమోదించింది. దీనిపై కడపకు చెందిన మహ్మద్ జాకీర్ హుస్సేన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మతాలను రెచ్చగొట్టేలా సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, మతాలను రెచ్చగొట్టేలా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠినచర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ హెచ్చరించారు.

రవాణా పేరుతో సరుకును కాజేసిన ఇద్దరు అరెస్టు



మాట్లాడుతున్న బద్వేలు రూరల్ ఇన్‌స్పెక్టరు నాగభూషణం

గోపవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రవాణా పేరుతో సరుకును కాజేసిన ఇద్దరు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం వివరాల మేరకు.. ఆకుల మహేశ్, పుంగవనం శివకుమార్ తరచూ వాహనాలను సరుకు రవాణా కోసం పంపుతుంటారు. ఆకుల మహేశ్ తన మినీ లారీకి శివకుమార్ సహాయంతో నెంబర్ ప్లేటు మార్చి ఆర్సీ, ఎఫ్‌సీ పర్మిట్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు నకిలీవి తయారు చేశాడు. వీటితో నెల్లూరుకు చెందిన తన స్నేహితుడిని డ్రైవర్‌గా పెట్టి గత నెల 20వతేదీ గోపవరం పరిధిలోని సెంచరీ ఫ్యాక్టరీకి చెందిన సుమారు రూ.5లక్షల విలువ గల ప్లైవుడ్ మెటీరియల్‌ను లోడ్ చేసుకుని కలకత్తాకు పంపాడు. అయితే లోడును నెల్లూరులోని ఒక రూములో దించి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. గత నెల 25న ఇదే విధంగా రూ.5 లక్షల విలువ గల పామాయిల్ డబ్బాలను లోడ్ చేసుకుని చేరవేయాల్సిన పాయింట్‌కు చేర్చకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీనిపై నెల్లూరు జిల్లా ముత్తుకూరు పోలీసులకు ఫిర్యాదు రాగా గత నెల 31 తేదీన అక్కడ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం నిందితులను పీపీకుంట సమీపంలో బద్వేలు రూరల్ సీఐ అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5లక్షల ప్లైవుడ్ మెటీరియల్‌ను, నకిలీ రికార్డులు తయారు చేయడానికి ఉపయోగించిన శివకుమార్ సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు.

కడప ఆరోగ్యశాఖ వైద్య సేవల డిప్యూటీ డైరెక్టర్ బదిలీ

కలికిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కడప ఆరోగ్య వైద్య సేవల ప్రాంతీయ సంచాలకుల కార్యాలంలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న పి.భక్తవత్స లం బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ మంగళగిరిలోని వైద్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డులో నియమించింది. పదిహేను రోజుల్లోగా ఆయన పదోన్నతి స్థానంలో చేరాలని కూడా ఆదేశిస్తూ ఆరోగ్య వైద్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యకు మించిన ఆస్తి లేదు : ఎమ్మెల్యే మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు, టీడీపీపొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



యూకేజీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు పొందిన చిన్నారులతో ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యకు మించిన ఆస్తి లేదని కడప నియోజకవర్గం శాసనసభ్యురాలు మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ అన్యువల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రధానంగా క్రమశిక్షణ పట్టుదలతో సాధించలేనిదంటూ ఏమీలేదని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చక్కగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, ప్రిన్సిపల్ మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై వైసీపీ ద్వంద్వ వైఖరి

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ లోక్‌సభలో ఒకలా.. రాజ్య సభలో మరోలా ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని ద్వారకా నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్‌కు సంబంధించి వైసీపీ లోక్‌సభలో ఒక వైఖరి.. రాజ్యసభలో మరో వైఖరి ప్రదర్శించిందన్నారు. లోక్‌సభలో బిల్లును వ్యతిరేకిస్తున్నామని చెబుతూ ఒక ఎంపీ కూడా బిల్లు వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. రాజ్యసభలో మాత్రం ఏడుగురు ఎంపీలు వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారని చెప్పారు. టీడీపీ ఎన్డీఏలో భాగస్వామ్యం కాబట్టి బహిరంగంగా బిల్లును మూడు సవరణలతో ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఆ మూడు ప్రతిపాదనలు కూడా కేంద్రం ఆమోదించిందని చెప్పారు. సవరణలు ప్రతిపాదించిన పార్టీ ఒక్క టీడీపీ మాత్రమేనని చెప్పారు. ముస్లింల మనోభావలు వారి ఐక్యత కోసం టీడీపీ నిత్యం పనిచేస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించింది టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అరటి పంటపై నివేదిక

సీకేదిన్నె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో దెబ్బతిన్న అరటి పంటపై నివేదిక తయారు చేస్తున్నామని ఉద్యాన శాఖ అధికారి జ్యోతిర్మయి తెలిపారు. శుక్రవారం బుగ్గలపల్లి, నాగిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గాలివానకు పడిపోయిన అరటిని పరిశీలించారు. దాదాపు ఆరు ఎకరాలకు పైగా అరటి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనావేశామన్నారు. రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వీఆర్వో లక్ష్మీకాంతమ్మ, వీహెచ్‌ఏ శిల్ప పాల్గొన్నారు.

మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కడప బార్ అసోసియేషన్‌లో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బార్‌అసోసియేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐఏఎల్ నాయకులు సి. సుబ్రమణ్యం, టీ. ఈశ్వర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రవదనలతో కలిసి ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 16న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలు జరగనున్నాయని.. ఇందుకు ముందుగా ఐఏఎల్ ఆధ్వర్యంలో జరగబోతున్న మోడల్ పరీక్ష ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు శనివారం ఉదయం 10-15 నిమిషాలకు పరీక్ష హాలు వద్దకు చేరుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉమాదేవి, ట్రెజరర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిపై వంతెన నిర్మాణానికి మోక్షం

- తాడిపత్రి నుంచి కొండాపురం వరకు రాకపోకలకు తొలగిన అడ్డంకి
- రూ.34 నుంచి రూ.62 కోట్లకు అంచనాలు పెంచి మంజూరు

కలికిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె నుంచి కడప జిల్లా కొండాపురం మండలం సిరిగేపల్లె (సంకేపల్లె, ఎస్.కొత్తపల్లె మీదుగా) వరకు ఉన్న రహదారిని బొందలదిన్నె వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 67)కి కలుపుతూ పెన్నా నదిపై వంతెన నిర్మాణం పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసింది. అప్పట్లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఈ వంతెన కోసం నిధులు మంజూరు చేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఈ వంతెన నిర్మాణం పని మూలన పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో పెరిగిన ధరలతోపాటు పెన్నానది అంతర్భాగంలో గడికోట రిజర్వాయరు బ్యాక్ వాటర్ నిల్వలను పరిగణనలోకి తీసుకుని కొత్త అంచనాలు రూపొందించారు. దీంతో రూ.34 కోట్ల నుంచి 62 కోట్లకు వ్యయం పెరిగింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం కొత్త అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసింది. పరిశీలించిన ప్రభుత్వం వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిధుల విడుదలకు ఆర్థిక శాఖ ఆమోదం కూడా లభించింది. ఫలితంగా పెన్నా నదిపై 67వ నంబరు జాతీయ రహదారికి పెన్నా నదిపై బొందలపల్లె వద్ద వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- కేసు నమోదు చేసిన పోలీసులు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అసభ్యంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన బద్వేలు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కంప్యూటర్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పెంచలయ్య 6వ తరగతి చదివే విద్యార్థినుల పట్ల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ... ఈ విషయాలను ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరించేవాడు. దీంతో విద్యార్థినులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక మనోవేదనకు గురయ్యేవారు. అయితే ఆ కీచక ఉపాధ్యాయుడు వికృత చేష్టలు శృతిమించి పోవడంతో ఓ విద్యార్థిని ఏడుస్తూ ఉండటంతో తల్లిదండ్రులు గమనించి.. ఏమి జరిగిందో చెప్పమని అడగటంతో విషయం బయట పడింది. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు, బంధువులు ఆ పాఠశాల వద్దకు చేరుకొని ఆ కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కీచక ఉపాధ్యాయుడు పెంచలయ్యను అదుపులోకి తీసుకొని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



బీడీకాలనీ నిండా సమస్యలు

అధ్వానంగా మట్టి రోడ్లు ● రోడ్డుపైనే మురుగునీరు

కడప క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం బీడీ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ఇక్క డ నివాసాలు ఏళ్ల తరబడి ఉన్నా సరైన వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. రింగు రోడ్డు ఆనుకుని ఉన్న ఈ కాలనీలో సరైన రోడ్లు లేవు. ఇక్కడ ఎక్కువ శాతం నివాసం ఉన్నది కూలీలు కావడంతో రోడ్లన్నీ ఎగుడు దిగుడుగా ఉన్నాయి. వర్షాలు పడితే మట్టి అంతా కొట్టుకు పోయి రాళ్ల ఉంటాయి. దీంతో పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక వృద్ధులు, పిల్లలు అయితే ఆ రహదారులపై నడవాలంటే నరక ప్రాయంగా మారుతుంది. కాలనీలోకి వెళ్లాలంటే ఆటోలు సైతం రోడ్డుపై తప్ప లోపలికి వెళ్లే పరిస్థితులు కనిపించవు. రోడ్లన్నీ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురి కాక తప్పదు. ఇక కాలనీలో ఎక్కడ చూసినా మురుగుకాల్వలు కనిపించక పోవడంతో ఇళ్లల్లోని మురుగంతా రోడ్లపైనే పారుతోంది. సాయంత్రం అయితే దోమలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక మసీదు రోడ్డు తప్ప అన్ని రహదారులు సీసీరోడ్లు కనిపించవు. రాళ్ల మధ్య వెళ్లాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల అయితే మనిషి నడిచేందుకు కూడా వీలు లేకుండా గుంతలు ఉన్నాయి. చిన్నపాటి వర్షాలు పడ్డా గుంతలు జలమయంగా మారుతాయి. మట్టి రోడ్లు కావడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రహదారి కూడా కనిపించని పరిస్థితులు ఉన్నాయి. ఏదిఏమైనా అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు, మురుగుకాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.




రోడ్డుపై పారుతున్న మురుగునీరు



అధ్వానంగా ఉన్న రోడ్డు

కమలాపురం ఎస్ఐగా విద్యాసాగర్



కమలాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం ఎస్ఐగా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రతాప్‌రెడ్డి కొండాపురానికి బదిలీ అయ్యారు.

వల్లూరు ...పెద్ద ఓబన్న



వల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండల ఎస్ఐగా పెద్ద ఓబన్న బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఈయన గతంలో తొండూరులో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వల్లూరుకు వచ్చారు.

కమలాపురం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా సిరిగిరెడ్డి రాఘవరెడ్డి



కమలాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా మండల పరిధిలోని బయనపల్లె గ్రామానికి చెందిన సిరిగిరెడ్డి రాఘవరెడ్డిని కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు టీడీపీ రాష్ట్ర కమిటీ నుంచి ఆదేశాలు వచ్చాయి. గత 18 సంవత్సరాలుగా టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు.టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సహకారంతో ఈ పదవి వరించిందని రాఘవరెడ్డి అన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌లో ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమాన్ని షెడ్యూల్ కులాల (ఎస్సీ) నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) సహాయ సంచాలకుడు రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు. సుమారు రెండు నెలల పాటు సాగే ఈ శిక్షణలో ఉచితంగా సామగ్రి, మధ్యాహ్నం భోజనం కల్పిస్తామన్నారు. 10వ తరగతి ఆపైన చదువుకున్న వారై 18 నుంచి 40ఏళ్లలోపు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 14వ తేదీలోపు పులివెందుల న్యాక్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు హిందూ దేవాలయాల్లో 'మన గుడి'

కడప కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6న ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 315 దేవాలయాల్లో మన గుడి కార్యక్రమం జరగనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచారమండలి సభ్యుడు బెస్తవేముల రామమహేశ్ తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కడప జిల్లా శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో అర్చక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తిరుపతి నుంచి వచ్చిన కంకణాలు, కుంకుమ, గోవిందనామాలు తదితర సామగ్రి శిక్షణ పూర్తి చేసుకున్న అర్చకులకు అందించారు. వీటిని ఉమ్మడి కడప జిల్లాలోని 29 ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నిర్మించిన దేవాలయాల్లో మన గుడి కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో టీటీడీ , హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా ప్రోగ్రాం అసిస్టెంటు గోపిబాబు పాల్గొని హాజరైన అర్చకులకు పూజా సామగ్రిని అందించారు.

'వక్ఫ్ సవరణ ఆమోదం ద్వారా పారదర్శకత'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడం పట్ల పారదర్శకతకు బీజం పడినట్లు అయిందని బీజేపీ అధికార ప్రతినిధి పాలెం సురేశ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు విషయంలో 2013లో కాంగ్రెస్ చేసిన చారిత్రాత్మక తప్పిదం వల్ల పారదర్శకత లోపించిందన్నారు. అప్పట్లో విశేష అధికారాలు అప్పజెప్పడం వల్ల ఏ ఆస్తినైనా వక్ఫ్ ఆస్తిగా పరిగణించి ఆక్రమించుకునేవారన్నారు. దీంతో పేద మధ్యతరగతి ముస్లిం మహిళల ఆస్తులు కూడా ఆక్రమించుకున్నారన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడం ద్వారా వక్ఫ్‌బోర్డు ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయం ఎంత, ఖర్చు ఎంత అనే విషయంగా పారదర్శకత లభిస్తుందన్నారు.

భావన టౌన్‌షిప్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : ఆర్‌సీపీ

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములలో వెలసిన భావన టౌన్‌షిప్‌ను తక్షణమే కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప కలెక్టర్ కార్యాలయం నందు ధర్నా కార్యక్రమాన్ని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఆర్సీపీనగర కార్యదర్శి మక్బుల్ బాష, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, తస్లీమ్, రైతు నాయకులు మునిరెడ్డి, ప్రతాపరెడ్డి, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేశ్, అజయ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామయ్యలోరి కల్యాణానికి రారండి

బైకుపై జెండాలతో వినూత్న ప్రచారం



చెన్నూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని సీతారామనామ సంకీర్తనలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణానికి రావాలంటూ చెన్నూరు హిందూ ధర్మ ప్రచార ఐక్యవేదిక సభ్యుడు లోమడ శివారెడ్డి ద్విచక్ర వాహనంపై కాషాయ జెండాలు కట్టుకుని చెన్నూరు మండలమంతా వినూత్న రీతిలో ప్రచారం చేశారు. ప్రజలకు కరపత్రాలు అందించారు.కాగా బైకుపై కాషాయ జెండాలతో చేసే వినూత్న ప్రచారం ప్రజలను బాగా ఆకట్టుకుంది.

'వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి'



సింహాద్రిపురంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

చెన్నూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ చెన్నూరులో శుక్రవారం ముస్లిం మైనార్టీ నేతలు శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారిష్, అష్రఫ్, సుభాన్, ఖిల్లా షాహీ మసీదు ప్రజలు, మైనార్టీ నేతలు మంజూరు అహ్మద్, షబ్బీర్‌హుస్సేన్, అన్వర్, ఫకృద్దీన్ జహీరుద్దీన్, మత పెద్దలు, ముస్లిం మైనార్టీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం సింహాద్రిపురంలో ముస్లింలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సింహాద్రిపురంలోని సున్నతుల్ జమియా మసీదు, జమియా మసీదు, మదీనా మసీదు, మహమ్మదీయ మసీదు ఆధ్వర్యంలో నమాజు అనంతరం ఆయా మసీదుల బయట ఆవరణలో నల్లరిబ్బన్లు ధరించి వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలి





ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, పాఠశాల సీఈఓ, కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి , సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నవీన టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో స్కిల్ కార్నివాల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ విద్యార్థులను వారి అభిరుచులకు తగ్గట్లుగా పెంచాలని తెలిపారు. సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎస్ఎస్‌సీలో రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఫలితాలను సాధిస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల సీఈఓ, కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి మాట్లాడారు. అలాగే విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయ బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నెలరోజులుగా ఈవో లేకపోవడంతో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పనిచేసే సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనం ఇవ్వడం లేదు, ఆదాయాన్ని తెచ్చే మార్కెట్ వేలం గడువు అయినపోయినా నిర్వహించే పరిస్థితి లేదు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వీటిపై పులివెందుల ఎమ్మెల్యే జగన్ పట్టించుకోరు, కూటమి నాయకుల దారి వారిదే. తక్షణం అధికారులు స్పందించి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెకు ఈఓ రావాలంటే హడల్ అంటూ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై తులసిరెడ్డి స్పందించి సమస్యలపై ఆరాతీశారు. నేరుగా కాంగ్రెస్ నాయకులతో కలిసి పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, పంచాయతీ పారిశుధ్యం, వాటర్ స్కీం సిబ్బందితో మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్య పరిస్థితి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, ఉత్తన్న, డాక్టర్ సుబ్రహ్మణ్యం, రామాంజనేయరెడ్డి, నాగరాజు, వినయ్, రమణ, బద్రినాథ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



కడప(వినాయకనగర్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో శుక్రవారం టీడీపీ నాయకుడు మల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అనాథ వృద్ధులకు మూగ బోయిన శివాయాదవ్, మిత్ర బృందం ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆనంద్‌బాబు, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, రఘురాం, శివశంకర్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ రద్దు చేయాలని ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.జగదీష్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీలకే సెట్‌లు నిర్వహించే స్వేచ్ఛ ఇవ్వాలని శుక్రవారం యోగివేమన యూనివర్సిటీలో ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో దిలీప్, భార్గవ్, నవీన్ తదితరులుపాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ శుద్ధి జలం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

సింహాద్రిపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ శుద్ధి జలం అందించడమే కూటమి ప్రభుత్వధ్యేయమని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరెడ్డితో కలసి నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీధర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, పంచాయతీ ఈఓ వెంకటరాముడు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలి : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోపనిచేసే తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం డీఈఈఓ కార్యాలయంలో ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్‌భూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లా కౌన్సిలర్లు మల్లికార్జున, కొండారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

పింఛనుదారులకు మరోమారు నోటీసులు

సింహాద్రిపురం, ఏప్రిల్ 4: మండల వ్యాప్తంగా వికలాంగుల పింఛనుదారులకు మరోమారు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మండల వ్యాప్తంగా 5,452 ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు ఉన్నాయి. ఇందులో వికలాంగుల పింఛన్లు 832 ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ల వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టారన్నారు. కాగా మరో 259 మంది పింఛనుదారులు పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పరిశీలనకు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ మార్గంలో సర్టిఫికెట్ పొంది పెన్షన్ పొందుతున్న వారిలో ఆందోళన మొదలైంది. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఏరియా ఆస్పత్రికి పరిశీలనకు వెళ్లాలని, లేని పక్షంలో వారి పింఛన్‌ను హోల్డ్‌లో పెడతామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు.

అధిక ధరలకు అమ్మితే డీలర్లపై చర్యలు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగుమందులు ఎవరైనా రైతులకు అధిక ధరలకు అమ్మితే చట్టపరంగా చర్యలు తప్పవని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం వ్యవసాయ డివిజను పరిధిలోని వల్లూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సరస్వతి, సాయిజ్యోతి, శ్యాంబాబు, కమలాపురం, ఎర్రగుంట్ల, వల్లూరు, వీఎన్‌పల్లె మండలాల డీలర్లు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై రైతులకు అవగాహన

సీకేదిన్నె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జీవామృతం తయారీ విధానంపై రైతులకు అగ్రికల్చరల్ విద్యార్థులు అవగాహన కలిగించారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో రైతులకు వివిధ పద్ధతులు నిర్వహించారు. సేంద్రియ సాగుపై అవగాహన పెంచే లక్ష్యంతో రైతులకు విద్యార్థులు జీవామృతం తయారీ వివరించారు. గోమూత్రం, గోమయం, పంచగవ్య, జాగ్రా పలుచటి మట్టి కలిపి జీవాంమృతం తయారీ విధానాన్ని రైతులకు చూపించారు. ఇవి భూసారాన్ని పెంచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులకు వివరించారు. తిరుపతికి చెందిన ఎస్వీ అగ్రికల్చరల్ విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు

● ప్రతిరోజు గ్రామాల విజిట్



వండాడి గంగయ్య
తహసీల్దార్, ప్రొద్దుటూరు

ముఖాముఖి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రొద్దుటూరు తహసీల్దారు వండాడి గంగయ్య పేర్కొన్నారు. ప్రతి రోజు ఆర్‌ఐ, వీఆర్‌వో, విలేజ్ సర్వేయర్‌తో గ్రామాలకు వెళ్లి మధ్యాహ్నం వరకు ఉండి రైతుల సమస్యలు తెలుసుకొని అక్కడే పరిష్కరిస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: పీజీఆర్‌ఎస్‌లు సకాలంలో పరిష్కరిస్తున్నారా ?

జవాబు: పీజీఆర్‌ఎస్‌లు సకాలంలో పరిష్కరిస్తున్నాం. కేవలం 36 మాత్రమే పెండింగ్ ఉన్నాయి.

ప్రశ్న: ఇనామ్, చుక్కల, అసైన్డ్ భూములు పూర్తిపై అయ్యాయా ?

జవాబు: ఇనామ్, చుక్కల, అసైన్డ్ భూములు సరిగా ఉన్నాయి. కేవలం 65 సెంట్లు మాత్రం రిజక్ట్ చేశాం. అన్ రిజిష్టర్డ్ కింద 2109 .89 ఎకరాలకు గాను 2097.36 ఎకరాలు క్లియర్ చేశాం. ఇంకా 13.61 ఎకరాలు డివియేషన్‌లో ఉన్నాయి.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణాపై ఏ చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: పెన్నానదిలో ఇసుక తవ్వకాలు నిషేధం అని ప్రకటించాం. వీఆర్‌వోలతో ప్రత్యేక టీంలు వేసి తవ్వకాలు జరుపకుండా చూస్తున్నాం.

ప్రశ్న: ఏటి పోరంబోకు భూముల్లో అక్రమ కట్టడాలపై చర్యలేంతీసుకున్నారు?

జవాబు: పెన్నానదిలో ఏటి పోరంబోకు భూములలో అక్రమ కట్టడాలు కట్టకుండా నిరోధిస్తున్నాం.ఇప్పటికే ఎన్ని అక్రమ కట్టడాలు నిర్మించింది సర్వేచేసాం. ప్రభుత్వం అనుమతిస్తే కూల్చివేస్తాం.

ప్రశ్న: అమృతనగర్‌లో ఆక్రమణలపై సమగ్ర సర్వే ఏమైంది?

జవాబు: మొత్తం 7936 ప్లాట్లలో 159 మంది ఎలాంటి డాక్యుమెంటు లే కుండా ఉన్నారు. 1282 ప్లాట్లు చేతులు మారికొనుగోలు చేసినవి ఉన్నాయి. సర్వేలో సమగ్ర వివరాలతో నివేదికను కలెక్టర్‌కు పంపుతాం. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

హుండీ చోరీ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమానుగురప్పస్వామి అన్నదాన సత్రంలో గురువారం హుండీ చోరీకి గురైందని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి వర్షం పడడంతో అక్కడున్న వాచ్‌మెన్ ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సమయానికి అన్నదాన సత్రంలో హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారని విషయం తెలుసుకున్న ఈవో నరసయ్య శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. హుండీని ముళ్లపొదల్లో పడవేశారన్నారు.

అకాల వర్షంతో పంటలకు తీవ్రనష్టం



పోరుమామిళ్లలో అకాల వర్షానికి నేలకొరిగిన వరిపైరు



కాశినాయనలో వర్షానికి తడిసి ముద్దయిన సజ్జలు



బి.మఠంలో అలుగుపారిన దృశ్యం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం కారణంగా పలు మండలాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా పోరుమామిళ్ల మండలంలో దాదాపు వంద ఎకరాలకు పైగా వరి పైరు దెబ్బతిని రైతులకు నష్టాన్ని తెచ్చి పెట్టింది. అంతేకాక క్రాసింగ్ పంటలైన సజ్జ పంట సాగు చేసిన రైతులు కూడా నష్టపోవాల్సి వచ్చింది. గురువారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం జోరుగా కురిసింది. ఈ వర్షంతో చేతికి వచ్చిన పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని దమ్మనపల్లె గ్రామంలో దాదాపు 50 ఎకరాల పైరు వర్షానికి నేలకొరిగింది. మరికొన్ని చోట్ల కల్లాల్లో రైతులు కుప్పలుగా పోసుకున్న ధాన్యం తడిచి ముద్దయింది. అలాగే పోరుమామిళ్ల, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో కాకుండా మరికొన్ని గ్రామాల్లో పైర్లు దెబ్బతిని రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. వరి పైరు కోతకు వచ్చి ధాన్యం ఇంటికి చేరుతుందనుకున్న తరుణంలో ఈ అకాల వర్షం వారికి శాపంగా మారింది. దీంతో రైతులు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలో పంట నష్టం అంచనా గురించి వ్యవసాయాధికారి వరహరికుమార్‌ను వివరణ కోరగా, 90 ఎకరాల్లో వరి పంట, 8 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిందని, దీనిని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

650 ఎకరాల్లో పండ్లతోటలు 200 ఎకరాల్లో సజ్జకు నష్టం

కాశినాయన ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి మండలంలో 650 ఎకరాల్లో అరటి బొప్పాయికి నష్టం వాటిల్లగా 200 ఎకరాల్లో హైబ్రిడ్ సజ్జపంటకు నష్టం వాటిల్లినట్లు హెచ్‌వో శ్రీనివాసులరెడ్డి, ఏవో జయలక్ష్మీ తెలిపారు. ఆమేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపినట్లు వారు తెలిపారు. మండలంలోని సావిశ్రీట్టిపల్లె, ఆకులనారాయణపల్లె తదితర గ్రామాల పరిధిలో సాగుచేసిన అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. ఉప్పలూరు, ఓబుళాపురం, పిట్టిగుంట తదితర గ్రామాల్లో హైబ్రిడ్ సజ్జ పంటకు నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన పంటలు వర్షం మూలంగా నేలకు వాలిపోయాయి. వర్షానికి ముందురోజు సజ్జపంట కోతకోసి కలాల్లో ఆరబోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి కల్లాలు తడిసి ముద్దకావడంతో సజ్జలు వేరొకచోటికి తరలించాల్సి వచ్చింది.

బి.కోడూరులో: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి సజ్జ, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడడంతో కోయని సజ్జ గాలికి పడిపోగా, కోసినవి తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే పొగాకు రైతులు గత నెల నుంచి కూలీలతో పొగాకు కోయించి గుడిసె ఏర్పాటు చేసి అందులో దారాలకు గుచ్చి వేలాడదీశారు. గాలి బీభత్సానికి పొగాకు చేలో వేసిన గుడిసెలు లేచిపోవడంతో ఆరబెట్టిన పొగాకు తడిచి ముద్దయింది. దీంతో అది అమ్మేందుకు రైతులకు వీలు కాదు. అంతేకాకుండా ఈ క్రాసింగ్ సజ్జ క్వింటా రూ.7వేలు, 5వేలతో రైతులు ఒప్పందంతో సజ్జపంట వేశారు. అవి కోయించిన తడిచిపోవడంతో రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. ప్రభుత్వం తమని ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మండలంలోని గుండాపురం గ్రామంలో గురువారం రాత్రి అకాల వర్షం కురవడంతో ఒక్కసారిగా గ్రామంలోని చెరువు అలుగు నిండి నీరు రావడంతో ప్రజలందరూ రాత్రంతా నిద్ర లేక ఇబ్బందులు పడ్డారు. అలాగే ఇళ్లల్లోకి నీరు వెళ్లడంతో ఇళ్లల్లోని ధాన్యం బస్తాలు కూడా తడిచిపోవడం జరిగిందని తెలిపారు. అలాగే పంట పొలాల్లోకి కూడా నీరు వెళ్లడంతో వరిపైర్లు దెబ్బతినడం జరిగిందని వెంటనే అధికారులు స్పందించి జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిక పంపి ప్రజలను ఆదుకోవాలని గుండాపురం గ్రామప్రజలు కోరుతున్నారు.

టూటౌన్ సీఐగా సదాశివయ్య బాధ్యతలు స్వీకరణ



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా సదాశివయ్య బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి రిజిష్టర్ బుక్‌లో సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ముందుగా డీఎస్పీ భావనను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సదాశివయ్య తిరుపతి పోలీసు ట్రెనింగ్ సెంటర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ యుగంధర్ ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. సదాశివయ్య గతంలో ఇక్కడ రూరల్ ఎస్‌ఐగా, అర్బన్ సీఐగా కూడా పనిచేశారు. ఎస్‌ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

గోపవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం సెంచురీ ప్లైవుడ్ కంపెనీకి ఎదురుగా హైవే రోడ్డుపై జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సుమారు 50 సంవత్సరాల వయసు గల మహిళను లారీ ఢీ కొట్టడం వల్ల ప్రమాదం జరిగింది. మహిళ పసుపు రంగు చీర ధరించి ఉంది. సదరు మహిళా గురించి విచారించగా బ ద్వేలు ప్రాంతానికి చెంది మతిస్థిమితం సరిగాలేదని తెలిసిందని బద్వేలు చుట్టుపక్కల వారు ఎవరైనా మహిళ గురించి తెలిసిన బద్వేలు రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో కుక్క దాడి చేసిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక మగవారు ఉన్నారు. వారిని తాళ్లప్రొద్దుటూరు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాహనాల వెంబడించి కుక్కలు కరుస్తున్నాయని చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లాలన్న భయపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కుక్కలబారి నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముగ్గురికి రిమాండ్

చాపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం, లక్ష్మీపేట, చాపాడు గ్రామాలకు చెందిన గురుసాయి, ఆంజనేయరెడ్డి, శివలను గురువారం మైదుకూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వారు గత నెల 30వ తేదీన చాపాడులోని పెంచల నరసింహ జనరల్‌స్టోర్ యజమాని నరసింహులుకు నకిలీ ఫోన్ పే ద్వారా రూ.3 లక్షలు మోసం చేసినందున వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగ ఫింఛన్‌దారులకు నోటీసులు

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఫింఛన్‌దారుల వెరిఫికేషన్ కోసం నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకోకుండా ఆగిపోయిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు వారి సచివాలయ పరిధిలోని సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేస్తారన్నారు. వారికి కేటాయించిన ఆసుపత్రిలో నిర్ణీత తేదిలో తప్పక వెరిఫికేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

900ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

● రూ.18 కోట్ల వరకు నష్టం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి కురిసిన అకాల వర్షాల వల్ల పోరుమామిళ్ల ఉద్యానవన శాఖ పరిధిలో 900 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ద్యానవన శాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బ్రహ్మంగారిమఠం ఇతర మండలాల్లో దాదాపు 352 మంది రైతులకు సంబంధించిన 900 ఎకరాల్లో కోత దశలో ఉన్న అరటి, బొప్పాయిపంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గురువారం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న ఉద్యానపంటలను అంచనా వేశామని దాదాపు రూ.18 కోట్లు నష్టం వాటిల్లిందని అంచనా వేశామని, తుది నివేదికలు సిద్ధం చేయడానికి క్షేత్రస్థాయిలో రైతు కేంద్ర సిబ్బందితో పూర్తి సమాచారం తీసుకుని సిద్ధం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రాథమిక అంచనా వేసి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

నష్టపోయిన రైతులకు సాయమందిస్తాం

బద్వేలుటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి):నియోజకవర్గంలో గురువా రం రాత్రి కురిసిన అకాలవర్షాల కారణంగా పలుచోట్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు సహాయమందిస్తామని టీడీపీ ని యోజకవర్గ సమన్వయకర్త రితేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఉండాలని నష్టపోయిన వారికి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందించి ఆదుకుంటామని తెలిపారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటల గురించి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. వెంటనే స్పందించిన వ్యవసాయశాఖా మంత్రి పంటనష్టపోయిన రైతుల వివరాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు.

రామాలయంపై పిడుగు పడి ధ్వజ స్తంభానికి దెబ్బ

కలసపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలోని కొండపేట గ్రామ రామాలయంపై గురువారం రాత్రి పిడుగు పడి ధ్వజస్తంభం బాగా దెబ్బతింది. పిడుగుపాటుతో ధ్వజస్తంభం కింద, చుట్టుపక్కల కాంక్రీట్‌కు కూడా పగుళ్లు ఏర్పడ్డాయి. రాత్రి కురిసిన అకాల వర్షానికి భారీ శబ్దంతో ఆలయంపై పిడుగు పడినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు.

ఎర్రగుంట్ల ఏఎంసీ ఛైర్మన్‌గా నాగరాజు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా భారతీయ జనతా పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు రామిరెడ్డిపల్లె నాగరాజును ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎర్రగుంట్లకు చెందిన నాగరాజు బీజేపీ సీనియర్ నాయకుడు. జమ్మలమడుగు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తన వంతు సేవలు అందించాడు. అందరితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ మృదుస్వాభావిగా పేరుతెచ్చుకున్నాడు. తన ఎంపికకు కృషిచేసిన ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డికి, మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డికి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి నాగరాజును అభినందించారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవు

ముద్దనూరు ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని ఎంపీడీవో ముకుందారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని పలు కార్యాలయాలు, అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా 104 వైద్య సేవలు, ఉపాధి హామీ పనులు పరిశీలించారు.అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ నాలుగు రోజుల నుంచి గైర్హాజరవడంతో మెమో జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగయ్య పాల్గొన్నారు.

ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్టు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని త్రీటౌన్ పరిధిలో ముగ్గురు క్రికెట్ బుకీలను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు.ఎస్‌ఐ యోగాంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బొర్రా లక్ష్మీకాంత్‌రెడ్డితోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42వేల నగదు, బెట్టింగ్ స్లిప్పులు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అధికారులపై విచారణ జరపాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలోని అధికారులపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ కోరారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు ఆదిలక్ష్మికి ఆయన వినతి పత్రం అందజేశారు.

పాఠశాల కొనసాగించాలంటూ ఎంఈవోకు వినతి

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని నరసన్నపల్లెలో ఎంపీపీ పాఠశాలలో 1 నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలని గ్రామ ప్రజలు ఎంఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం ఏర్పాటు నుంచి ఐదో తరగతి వరకు కొనసాగిస్తున్నారని అయితే గత ప్రభుత్వంలో 3, 4, 5 తరగతులను ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న హైస్కూలుకు మార్చడంతో చిన్న పిల్లలు, దివ్యాంగులు ఇబ్బందులకు గురవుతున్నారనిని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి 5వ తరగతి వరకు పాఠశాల కొనసాగించాలని కోరారు. గ్రామస్థులు చెంద్రాయుడు, గంగయ్య, పీటర్, గణపతి ఓబులేసు, నారాయణయాదవ్, సుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఆస్పత్రిలో రోగుల రికార్డు పరిశీలించి మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ హిమదేవి

జమ్మలమడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం డీసీహెచ్‌ఎస్ హిమదేవి తనిఖీ చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు రాక రోగుల ఇక్కట్లు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారిణి శుక్రవారం ఉదయం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు ఆమె క్షుణ్ణంగా పరిశీలించి రోగుల సంబంధించి రికార్డులను, మందులను తనిఖీ చేసి వైద్య చికిత్సలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. స ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది వైద్యం ఎలా అందిస్తున్నారని నిర్లక్ష్యంగా ఏమైనా చేస్తున్నారా అని అడిగారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంలో కొందరు ఉన్నట్లు ఆమె పరిశీలనలో తేలినట్లుగా తెలుస్తోంది. అనంతరం డీసీహెచ్‌ఎస్ హిమదేవి విలేకరులతో మాట్లాడారు. సదరం క్యాంపునకు డాక్టర్లు వెళ్లడంతో మరి కొంతమంది సెలవు పెట్టడంతో రోగులకు ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడినట్లు తెలిపారు. ఏది ఏమైనా సమస్యలను స్పందించి ఆస్పత్రిలో తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందితో మధ్యాహ్నం ఆమె సమావేశమై భవిష్యత్తులో రోగులకు ఇబ్బంది కలిగించరాదని చెప్పినట్లు తెలుస్తోంది. కొందరు క్లీనిక్‌లలో వైద్యం అందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులను సక్రమంగా చూడకుండానే వెళ్లిపోతున్నారని ఆరోపణలున్నాయి. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం



ఛైర్మన్, కౌన్సిలర్లతో నీటి సమస్యపై మాట్లాడుతున్న కమిషనర్ పేర్లిశేషఫణి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతిలో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. ఎర్రగుంట్లలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకునేందుకు ఛైర్మన్ మూలె హర్షవర్దన్ రెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 17వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి మాట్లాడుతూ ఎప్పటినుంచే పేరుకుపోయిన నీటి పన్నులకు పేదవారి విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరగా నీటి పన్ను బకాయిలు కంప్యూటర్‌లో ఫీడ్ అయి ఉన్నాయని వాటిని తొలగించడం ఎవరిచేతుల్లో లేదని కమిషనర్ సమాధానం చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆయా వార్డులో బోర్లు వేస్తామని కమిషనర్ తెలిపారు. 617 అక్రమ కుళాయిలున్నట్లు తేలిందని వాటిని వెంటనే రెగ్యులర్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. కాగా సమావేశానికి 20మంది కౌన్సిలర్లలో కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, వార్డు సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలో రైతన్నలకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరయ్యాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శివశంకర్‌రెడ్డి తెలిపారు. రూ.8 లక్షలు విలువచేసే సుమారు 35 పరికరాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వాటిలో ప్రధానంగా విత్తనగొర్రు, ఈనాడుగొర్రు, తొమ్మిది చెక్కల గొర్రు, మందు పంపులు, తైవాన్‌స్ప్రేయర్, బ్యాటరీ స్ప్రేయర్ తదితర ముఖ్యమైన పరికరాలు వచ్చాయని తెలిపారు. సబ్సిడీపై పరికరాలు కావాల్సిన రైతులు వారి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు అయిదు ఎకరాలలోపు పొలం కలిగి ఉండడంతోపాటు ట్రాక్టర్ ఆర్‌సీ కలిగి ఉండి ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకొని ఉండాలని ఏవో వివరించారు.

అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అం దిస్తున్న అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు మండలంలోని అంబవరం పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ కాలనీలో లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ లబ్ధిదారులందరు హౌసింగ్ అధికారులతో కలిసి వారి పేర్లను పరిశీలించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు మంజూరు చేసిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులంతా ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని, నీటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు చేపట్టాలి

బద్వేలు/రూరల్/టౌన్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ పాఠశాలలలో 6వ తరగతి విద్యార్థినిపై అదే పాఠశాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య లైంగిక వేధిం పులకు పాల్పడడం బాధాకరమని అతనిపై పోక్సోకేసు నమోదు చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలో నానాటికి ఇలాంటి సంఘటనలు అధికమవుతు న్నాయని ఇలాంటి ఘటనలకు పాల్పడితే విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలని ఆయన ప్రశ్నించారు. పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు. కాగా విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్.గౌస్‌పీర్ కోరారు. ఇదిలా ఉండగా విద్యార్థిను లపట్ల అసభ్యరంగా ప్రవర్తిస్తున్న కీచక ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేయాలని ఏఐఎస్‌ఏ జిల్లా నాయకుడు బండి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఏ నాయకులు శంకర్, బన్నీ, అంజి పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడండి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె పంచాయతీ గ్రామపొలం సర్వేనెంబర్ 812లో రజకులకు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని రజకసంఘం నాయకులు కోరారు. 27సంవత్సరాల క్రితం మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి ఆధ్వర్యంలో రజకులకు 3.30ఎకరాలు కేటాయించి పట్టాలు ఇవ్వగా మూడు రోజుల క్రితం కబ్జాదారులు ఆ స్థలాలపై కన్నువేసి వాటిని ఆక్రమిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డికి రజకులు విన్నవించారు. వాటిని తక్షణమే రెవెన్యూ అధికారులతో మాట్లాడి రజకులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రజకులు హర్షం వ్యక్తం చేశారు.

భూముల రీసర్వేపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ

అట్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో ముందస్తుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అట్లూరు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. శుక్రవారం తంబళ్లగొంది, ఎర్రబల్లె, గుజ్జులవారి పల్లె గ్రామాల రెవెన్యూ అధికారులతో రీసర్వే నిర్వహించడంపై ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ముందస్తుగా రీసర్వే నిర్వహించే భూముల పట్టాదారు పాస్‌పుస్తకాలు పూర్తి ఆధారాలతో అధికారులకు సహకరించి భూములను రీసర్వే చేయిం చుకోవాలని తెలిపారు. ఆర్‌ఐరమణ, వీఆర్వో వెంకటసుబ్బమ్మ, టీడీపీ నేత మునిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.అగ్రహారం ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాలతో మండల టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి తాగునీటి సమస్యను పరిష్కరించారు. నూత నంగా తాగునీటి మోటరు బిగించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేయ డంతో ప్రజలందరూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు పుట్టాల శివ, పెరుగు నాగేంద్ర, బాస్కర్, నాగయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో టీబీ నిర్ధారణ పరీక్షలు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎం ఆర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలను ప్రారంభించారు. మొదటి టెస్ట్ డోస్‌ను వైద్యఅధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు వేశారు. సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీవో సుబ్బారెడ్డి పాల్గొన్నారు.